


# కిట్టు ఆత్మకథ

పద్మలత జయరాం

పుచ్చ పువ్వు లాటి వెన్నెల నేలంతా పరుచుకుంది. త్రయోదశినాడే పున్నమి నాటి వెలుగుని ఒలకబోస్తూ, తన వలయాకారాన్ని విస్తృతం చేసి, నింగిలో ఠీవిగా నిలబడ్డాడు చందమామ. పగటి పూవులు శెలవు తీసుకుంటూంటే, 'రే రాణి' సువాసనలు వెదజల్లుతూ అప్పుడే డ్యూటీలోకి దిగింది. 'పగలు' కాదే పిచ్చి పిట్టల్లారా! చందమామ కాంతు లవి' అంటూ గూటిలోంచి ఎగరబోతున్న తమ కూనలను మందలిస్తున్నాయ్ పక్షులు, కిలకిలరావాలతో.

ఆరు గంటలకే వస్తానన్న రాగిణి, ఏడు దాటినా రాలేదని, మాటిమాటికి టైం చూసుకుంటున్నాడు రాజేష్. కూర్చున్న చోటి నుంచి లేచి అటూ ఇటూ తిరుగుతూ, ఇందిరాపార్కులోని 'సరస్సు' దగ్గరగా వచ్చి నిలబడ్డాడు. పార్కుకి వచ్చిన వాళ్లు చాలా మంది ఇంటి ముఖం పట్టడం చేత, బోట్ షికారు కోసం నిల్చున్న వాళ్లు ఇద్దరో, ముగ్గురో తప్ప ఎక్కువ మంది లేరు. ఇంకొంచెం ముందుకు నడిచి గేట్ వైపే దృష్టిని కేంద్రీకరించి ఆతృతగా ఎదురుచూస్తూ, 'ఇహ రాదేమో' అని అనుమానిస్తూ, తిరుగుతున్న రాజేష్‌కి సరస్సు ఒడ్డునే చిన్న పొదలోంచి ఎవరో వెక్కుతూ ఏడుస్తున్న శబ్దం వినిపించి ఠక్కున ఆగిపోయాడు. అయిదు నిముషాలు అక్కడే నిల్చున్నా ఏడుపు ఆగకపోగా, మరింత ఉధృతం కాసాగింది. మరిక ఆగలేకపోయాడు రాజేష్, పొదలోకి తొంగి చూచి, అక్క డున్న ఏడు, ఎనిమిదేళ్ల వయసున్న పాలుగారే పసివాడిని చూచి విస్తుపోయాడు.

"ఇలారా బాబూ!" అంటూ ఎత్తుకొని బయటికి తీసుకొచ్చాడు. ముద్దులు మూటగట్టే వర్చస్సుతో, చారికలు కట్టిన బుగ్గలతో, నీరసంగా ఉన్నా డా బాబు.

"ఏం బాబూ! ఎందుకు ఏడుస్తున్నావ్? తప్పిపోయావా?" లాలనగా అడిగాడు రాజేష్.

'కాదన్నట్లుగా తల తిప్పాడు.

"ఆకలిగా ఉందా?" మళ్లీ అడిగాడు రాజేష్.


మళ్లీ తల అడ్డంగా తిప్పాడు, బాబు.

"చీకటిగా ఉందని భయపడుతున్నావా?"

మళ్లీ కాదన్నట్లు తల తిప్పాడు. విసు గనిపించింది రాజేష్‌కి.

చికాకుని అణుచుకుంటూ అడిగాడు. "మరెందుకు ఏడుస్తున్నావ్? నీకు అసలు తెలుగు మాట్లాడటం వచ్చా! చెప్పు నాన్నా, మంచివాడివి కదూ! మీ ఇల్లు ఎక్క డుందో చెప్పు, తీసుకెళ్లి దింపుతాను."

"వద్దు! నేను ఇంటికి అస్సలు వెళ్లను అంతే!" ఒక్కసారిగా అంటూ, మళ్లీ ఏడుపు




మొదలు పెట్టాడు. ఏం చేయాలో తోచలేదు రాజేష్‌కి. అనవసరంగా తెచ్చిపెట్టుకున్నా నీ తంటా అనుకుంటూ తల ఎత్తిన రాజేష్‌కి, దూరం నుంచి చెయ్యి ఊపుతూ, గబగబా నడిచి వస్తున్న రాగిణి కనిపించింది, ట్యూబ్ లైట్ల కాంతిలో.

"సారీ, రాజేష్! లేటయ్యింది. సడెన్‌గా మీటింగ్ అరేంజ్ చేశాడు మా బాస్. మినిట్స్ రాసుకుని మీటింగ్ పూర్తయ్యే వరకూ ఉండవలసి వచ్చింది. ఫోన్ చేసి చెబ్దామన్నా ఎక్కడికి చెయ్యాలో తోచక ఊరుకున్నాను." క్షమాపణ అడుగుతూ, "హాయ్! ఎవ రీ స్వీట్ కిడ్? మన స్టెప్ సన్ కాదు కదా! అయినా నాకు ఓ.కే.నే. రెడీమేడ్ చైల్డ్. కష్టపడి కనే అవసరం లేదు. నాకైతే ఎలాంటి అభ్యంతరమూ లే దబ్బాయ్." అల్లరిగా అంటూ, బాబుని ఎత్తుకొని ముద్దులు పెట్టింది రాగిణి.

ఎంత గంభీరమైన వాతావరణాన్ని అయినా సరే సరదాగా మార్చేసి, గలగలా పారే సెలయేరుని గుర్తుకి తెచ్చే రాగిణి, కొత్త వాళ్లతో సైతం, కొన్ని నిముషాల్లోనే స్నేహం చేసేయగలదు. క్రిందటి నెలలో ఎంగేజ్‌మెంట్, వచ్చే నెలలో పెళ్లి, మధ్యలో ఉన్న ఈ నెలంతా 'స్వీట్ నథింగ్స్' చెప్పుకుంటూ, ప్రేమంటే ఏమిటో తెలుసుకోవాలని చెప్పలేనంత ఆత్రపడుతున్న 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' జంట రాజేష్, రాగిణిలు.

*** *** ***

తమాషా, తమాషా కబుర్లు చెబుతూ, వాడికి అర్థమయ్యే జోక్స్ చెప్పి నవ్విస్తూ, పార్క్ బయటికి తీసుకొచ్చి, పక్కనే ఉన్న రెస్టారెంట్‌లో కూర్చోబెట్టి నెమ్మదిగా ఆ బాబులోని భయాన్ని బిడియాన్ని పోగొట్టింది రాగిణి. రాజేష్ తెప్పించిన 'కసాటా' అయిస్ క్రీమ్ తినిపిస్తూ వాడి వివరాలు రాబట్టడానికి ప్రయత్నం మొదలెట్టింది. చెప్పడం మొదలెట్టాడు బాబు.

"నా పేరు కిట్టూ. అంటే నిజం పేరు అది కాదు. మొత్తం ఏంటంటే నాగ వెంకట సాయి కృష్ణ చైతన్య. నే నేమో సెయింట్ మార్క్స్ స్కూల్లో మూడో తరగతి చదువుతున్నాను. తమ్ముడు కూడా మా స్కూలే. నర్సరీ. అమ్మంటే నాకు కోపం, అందుకే అమ్మ పేరు చెప్పను. సుధారాణి అని కూడా చెప్పను. నాన్న పేరు ప్రభాకరరావు" బయోడేటా చెపుతూ మధ్యలో ఆపేశాడు, అనుమానంగా.

"ఊ, చెప్పు నాన్నా కిట్టూ! నేను ఎవ్వరికీ చెప్పనుగా ప్రామిస్! ఎందుకు ఏడుస్తున్నావు? అసలు ఇక్కడికి ఎలా వచ్చావు? అమ్మకి, నాన్నకి తెలుసా?"

"ఊహూ." తల అడ్డంగా తిప్పాడు కిట్టూ.

"ఎలా ఇప్పుడు? వాళ్లు నీ కోసం ఎంత వెతుకుతున్నారో కదూ, పద మీ ఇల్లు చూపించు. ఇంటి దగ్గర దింపేస్తాం." లేచి నుంచున్నాడు రాజేష్.

"నేను రాను ఇంటికి అస్సలు రాను. మా అమ్మకి నే నంటే అస్సలు ఇష్టం లేదు. అందుకే పారిపోయి వచ్చాను. అమ్మమ్మా వాళ్ల ఊరు వెళ్లిపోతాను." మొండిగా అంటూ లేచి పరుగెత్తబోయిన కిట్టూని బలవంతంగా ఆపింది రాగిణి.

"ఏయ్! ఎక్కడికి? మేం తీసుకు వెళ్తాంలేం అమ్మమ్మ వాళ్ల ఊరికి, ఇంతకీ ఎందుకు వచ్చేశావు, ఇంటి నుంచీ? అమ్మ మీద, అన్నం మీద అలగవచ్చా?" అనునయంగా అంది.

మళ్లీ చెప్పడం ఆరంభించాడు కిట్టూ.

"అమ్మకి నా మీద కొంచెం కూడా ఇష్టం లేదు. ఊరికే తిడుతోంది. అప్పుడప్పుడూ బాగా కొడుతోంది కూడా. తమ్ముడు రాకుండా ఉంటే ఎంత బాగుండేదో. అప్పుడైతే అమ్మ నాకు రోజూ అన్నం కలిపి నోట్లో పెట్టేది. స్నానం చేయించేది. అమ్మే నన్ను రోజూ స్కూల్ దగ్గర స్కూటర్ మీద దింపేది. సాయంత్రం ట్యూషన్ నించి తీసుకొచ్చేటప్పుడు, రోజూ బేకరీలో స్నాక్సూ పేస్ట్రీలూ కొనిపెట్టేది. ప్రతిరోజూ రాత్రి పూట కథ చెప్పి బజ్జో పెట్టేది. ప్రతి ఆదివారమూ మా నాన్న నేనూ, మా అమ్మ కలిసి బయటికి వెళ్లే వాళ్లం. అప్పుడు నాకు స్కూల్లో ఫస్ట్ ర్యాంక్ వస్తే, నాన్న సైకిల్ తెచ్చారు. అమ్మేమో క్యారమ్స్ బోర్డు కొనిచ్చింది. అమ్మే నాకు బోర్డు ఆడటం నేర్పించింది. అమ్మ నేర్పిన పాట, మా స్కూల్లో పాడితే నాకు బహుమతి కూడా వచ్చింది. ఎప్పుడూ నవ్వుతూ ఉండేది. అస్సలు కొట్టేది కాదు. ఇప్పుడే ఈ తమ్ముడు గాడు వచ్చాకే అమ్మ మారిపోయింది. వాడి వల్లనే అమ్మ మారిపోయింది." మళ్లీ కిట్టుగాడి గొంతులోకి ఏడుపు జీర వచ్చింది.

"తప్పు నాన్నా! అలా అనకూడదు. తమ్ముడు ఏం చేశాడు? చిన్నవాడు కదా, వాడిని అలా అనవచ్చా. ఇంతకీ తమ్ముడి పేరేమిటి?"

"చింటూ! అంటే నిజం పేరేంటంటే చాణుక్య."

"పేరు భలే ఉందే! అయితే అస్సలు బాగుండడన్నమాట తమ్ముడు. నువ్వయితే ఎంత బావున్నావో." బుగ్గలు పుణికి అంది రాగిణి వాడికి ఉత్సాహం తెప్పిస్తూ.

"మా తమ్ముడు ఎంత బాగుంటాడో మీకేం తెల్సు?

"వాడి బుగ్గలు ముద్దు పెట్టుకుంటే కందిపోతాయని అమ్మ. అసలు ముద్దు పెట్టుకోనియ్యదు, కానీ, లేకపోతే కొరికేద్దా మనిపిస్తుంది.

"ఇదిగో ఈ ఆంటీ లాగా.కదూ, ఓ సారి ట్రై చేస్తావా" రాగిణి బుగ్గ మీద చిటికె వేస్తు అన్నాడు రాజేష్.

"ఉష్, ముందు వాడి సంగతి చూడండి" అన్నట్లు సైగ చేసి, "మరో అయిస్ క్రీమ్ తింటావా?" అంది రాగిణి కిట్టూతో. మొహమాటంగానే తల ఊపాడు కిట్టూ. వాడి బింకం చూసి నవ్వొచ్చింది రాగిణికి. మరో అయిస్ క్రీమ్ ఆర్డర్ చేసి, తమ కోసం కూల్ డ్రింక్స్ తెప్పించాడు రాజేష్.

"సరే, తమ్ముడు ముద్దుగా ఉంటాడు కదా! మరి నీ కెందుకు వాడి మీద కోపం?"

సమాధానం చెప్పలేకపోయాడు కిట్టూ.

"ఈ గొడవంతా మన కెందుకు, వాడి ఇల్లు కనుక్కొని దింపేద్దాం. లేకపోతే పోలీస్ స్టేషన్‌లో అప్పగించేద్దాం పద. ఎనిమిది దాటింది ఇంకాసేపాగితే మీ అన్నయ్య నీ కోసం పోలీస్ కంప్లయింట్ ఇస్తాడు లే, లే!" లేచి నిల్చున్నాడు రాజేష్.

"మా అన్నయ్యకి నా కోసం అంత భయపడాల్సిన అవసరం లేదు, ఎంచేతంటే, బాడీగార్డుని ఏర్పాటు చేశాడు కదా!" నడుస్తూ అంది రాగిణి.

"నేను ఇంటికి రాను." అక్కడే ఆగిపోయాడు కిట్టూ.

"అరే! ఏమిటి నాన్నా ఇంకా కోపం పోలేదా అమ్మ మీద?"

"ఊహూ, మరే ఇందాక నన్ను స్కేల్ పెట్టి కొట్టిందిగా! నాన్న కూడా బాగా కొట్టారు, నేను రాను." ఏడుస్తూ అన్నాడు కిట్టూ.

"ఎందుకు, అల్లరి చేశావా?"

"నేనేం అల్లరి చేయలేదు. తమ్ముడే. రోజూ స్కూల్ లంచ్ అవర్లో తమ్ముడిని, బేబీకేర్‌లో దింపుతాను కదా! అమ్మ, నాన్న ఆఫీసుకి వెళ్లిపోతారు. ఈ రోజు రోడ్డు క్రాస్ చేయిస్తుంటే నా చెయ్యి వదిలేసి పరిగెత్తాడు. కొంచె ముంటే బస్ క్రింద పడిపోయేవాడే. డ్రైవర్ సడెన్ బ్రేక్ వేసి, బస్సు ఆపి నన్ను బాగా తిట్టాడు. తమ్ముడి చేతికి,

కాలికి దెబ్బలు తగిలాయి. ఆ బస్సులోనే కామేశ్వరి ఆంటీ ఉంది, ఆమె పోయి మా మమ్మీకి ఫోన్ చేసి చెప్పింది. అప్పుడు అమ్మ ఇంటికి వచ్చి, 'తమ్ముడిని పట్టుకోవటం కూడా రాదా వెధవా' అని నన్ను బాగా తిట్టింది, కొట్టింది కూడా. నే నేం చెయ్యను ఆంటీ, తమ్ముడు నా మాట అస్సలు వినడు. వాడి నంచి పట్టుకొని, ఇం కో చేత్తో చెయ్యి పట్టుకొని క్రాస్ చేయిస్తుంటే చెప్పినా వినకుండా పరిగెత్తుతా డు. ఎప్పుడూ ఇంతే. నా బొమ్మలూ, పుస్తకాలూ అన్నీ తీసుకొని చించేస్తాడు. అమ్మ ఆఫీసు నుంచి రాగానే చెప్తే కూడా నన్నే తిడుతుంది."

"అమ్మది ఏ ఆఫీసు?"

చెప్పాడు కిట్టు.

"అయితే అమ్మకి నీ మీద ఇష్టం లేదంటావు?"

"అవును, అస్సలు లేదు. ట్యూషన్ నించి నేను వచ్చేసరికి, ఇంట్లో ఎవ్వరూ ఉండరు, ఎంత ఆకలేస్తుందో. పక్క ఫ్లాట్‌లో ఆంటీ ఏమయినా పెడితే తిన్నానంటే, అమ్మకి కోపం. అమ్మ, నాన్న తమ్ముడు వచ్చేదాకా గుమ్మంలోనే కూర్చోవాలి. ఆడుకోవడానికి కూడా ఉండదు. వాళ్లు వచ్చాక పాలు తాగి మళ్లీ హోమ్ వర్క్ చేసుకోవాలి. ఇంతకు ముందయితే అమ్మదగ్గర కూర్చుని హోమ్ వర్క్ చేయించేది. అన్నం పెడుతూ, ఎన్ని కబుర్లు చెప్పేదో, ఇప్పుడేమో ఎప్పుడూ తమ్ముడు, తమ్ముడు. నా గురించి అస్సలు పట్టించుకోదు. హోమ్ వర్క్ చేయకపోతే టీచర్ డైరీలో రాస్తుంది కదా! అది చూచి అమ్మా, నాన్న ఇంకా తిడ్తారు. నా కెంత ఏడుపొస్తోందో. అప్పు డయితే అమ్మ చక్కగా పక్కనే పడుకోబెట్టుకొనేది. ఇప్పుడేమో తమ్ముడిని పడుకోబెట్టుకుని, నన్నేమో ఇంకో గదిలో పడుకోమంటోంది. నా కెంత భయమేస్తుందో ఒక్కోసారి. అమ్మకి, నాన్నకి నా మీద అస్సలు ఇష్టం లేదు. నాకు ఈ సారి ర్యాంక్ రాలేదని నాన్న కూడా నన్ను బాగా తిట్టారు. అందుకే, అందుకే నేను ఆ ఇంటికి పోను. నన్ను అమ్మమ్మ వాళ్ల ఊరికి పంపించెయ్ ఆంటీ, ప్లీజ్."

తన కష్టాలన్నీ మాటల్ని కూడగట్టుకుంటూ కిట్టూ చెబుతూంటే గుండె ద్రవించిపోయింది రాజేష్, రాగిణీలు ఇద్దరికీ. తల్లి ప్రేమ దూరమైతే - కారణం ఏదైనా కానీ, ఆ తల్లి కుండే కారణాలు, వ్యాపకాలు ఏమైనా ఉండనీ - పసి హృదయంలో ఎగిసే బడబానలం ఎవరికి అర్థం అవుతుంది, ఆ హృదయాన్ని అర్థం చేసుకునే హృదయం ఉన్న వాళ్లకి తప్ప. ఆకాశానికి అంటుతున్నట్లున్న ధరలు, భార్యా భర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చెయ్యాల్సిన అవసరాల్ని కల్పిస్తున్నా ఆ అవసరాల్ని తగ్గించుకుని, కనీసం పిల్లలకు ఊహ తెలిసే వరకైనా తల్లి ఉద్యోగం చెయ్యకపోతేనే మంచిదేమో.

చెమర్చిన కళ్లతోనే, కిట్టూ కన్నీళ్లు తుడిచింది రాగిణి.

"నేను చెప్తాగా నాన్నా మీ అమ్మకి. అసలు ఏ అమ్మకయినా, ఒక్కళ్లంటే ఇష్టం, మరొకళ్లంటే అయిష్టం ఉంటాయా? అన్న లుండవు. నువ్వు చిన్నవాడివి కదా! అందుకే నీకు తెలియలేదు. అయినా నేను మీ అమ్మతో చెప్తాగా! మా నాన్న కదూ, మీ ఇల్లు ఎక్కడో చెప్పవూ. ఇంత చీకట్లో, నీ అంత పిల్లలు తిరగొచ్చా. పిల్లల్ని ఎత్తుకుపోయే వాళ్లు ఎంత మందో ఉంటారు, ఈ ఊళ్లో తెలుసా?" అనునయంగా చెప్తూ కిట్టూ వాళ్ల అపార్ట్‌మెంట్స్ పేరు తెలుసుకుంది రాగిణి వాడి దగ్గర్నించే. కోపం పోయిందేమో, వాడు కూడా "అమ్మ, తమ్ముడు కావాలి, ఇప్పుడే పోదాం" అంటున్నాడు.

దారిలో, స్కూటర్ డ్రైవ్ చేస్తూ అన్నాడు రాజేష్ - "రాగిణీ నువ్వు ఉద్యోగం మానెయ్యి."

అదిరిపడింది రాగిణి. "అదేం! ఉద్యోగం చేసే అమ్మాయి కావాలి అనే కదా, నన్ను ఎంపిక చేసుకుంది తమరు."

"కానీ, నా కొడుకు మరో కిట్టులా అవడం నా కిష్టం లేదు." దృఢంగా అన్నాడు రాజేష్.

"ఇదే మా ఇల్లు, అదిగో మా అమ్మ." ఆనందంగా అరిచాడు కిట్టూ, గేట్ దగ్గరే నిలబడి, ఎప్పటి నుంచో రోదిస్తున్నట్లుగా ఎర్రబడిన కళ్లతో, పిల్లవాడిని ఎత్తుకున్న స్త్రీని చూపిస్తూ.

కిట్టూని చూడగానే, ఒక్క ఉదుటున ముందుకు వచ్చి ఎత్తుకుని, ముద్దులాడిం దామె. అంతలోనే అప్పటివరకు పడ్డ దిగులు అంత ఆమె నేత్రాల్లోంచి వెల్లువలా ఉబికి, నోట మాట కూడా రాలేదు. అయిదు నిముషాల తర్వాత కానీ ఈ లోకంలోకి రాలే దామె.

"మీరు, మీరు... మీకు మా బాబు ఎక్కడ కనిపించాడు, అసలు మీకు మా ఇల్లు ఎవరు చూపారు?" రాగిణి, రాజేష్‌లను అడిగిం దామె లోపలికి దారి తీస్తూ. అక్కున చేరిన కిట్టూ తల్లిని పూర్తిగా హత్తుకుపోయాడు.

"నా పేరు రాజేష్, ఈమె నా కాబోయే భార్య. మీ బాబు, ఇందిరా పార్క్‌లో ఏడుస్తూ కనిపిస్తే తీసుకు వచ్చాం."

"చాలా థాంక్స్. మీకు ఎలా థాంక్స్ చెప్పాలో కూడా తోచకుండా ఉంది. సాయంత్రం నుంచీ వాడు కనిపించకపోయేసరికి, వాడి ఫ్రెండ్స్ అందరి ఇళ్లల్లోనూ వెతికాం. మా వారు ఆయన స్నేహితులతో కలిసి ఊరంతా గాలిస్తున్నారు. ఈ రోజు మీరే లేకపోతే ఏమయ్యేదో" ఉద్విగ్నంగా అం దామె.

"ఒక్క నిమిషం, కాఫీ తీసుకుందురుగాని" వాళ్లని డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోపెట్టి, వంటింటిలోకి దారి తీస్తున్న కిట్టూ తల్లిని ఆపింది రాగిణి. "నో థాంక్స్ మేడమ్, మరోసారి. మీరు మరోలా భావించనంటే ఒక్క విషయం చెప్తాను."

"ఏమిటి" అన్నట్లు చూచింది ఆమె.

"ఈ రోజు మీ బాబు అదృష్టం, మీ అదృష్టం బాగుండి మా కళ్లబడ్డాడు, తిరిగి మీకు దొరికాడు. వాడి లేత మనసు ఎంత గాయపడిందో, మీకు వాడి నోట వింటేనే బాగా అర్థం అవుతుందేమో! వాడిని మీ నిర్లక్ష్యం, మీ ఉద్యోగ బాధ్యతలు ఇంటి నుంచి పారిపోయేటట్లు చేశాయి. పదేళ్లయినా లేని పసివాడి మీద మోయలేనంత బాధ్యతలు మోపారే. మీరు తల్లిగా భరించాల్సిన బాధ్యతల్ని నిర్వర్తించకపోగా, వాడిని వాడే సరిగ్గా చూసుకోలేడు, అలాంటి వాడికి తమ్ముడిని కూడా చూసుకోమంటే... ఇది ఎంత అన్యాయం!

"న్యాయంగా వాడి వాటాకి రావాల్సిన ఆప్యాయతల్ని వాడికి అందించండి. పిల్లల సంఖ్య పెరిగిన కొద్దీ, ప్రేమ రెట్టింపు కావాలే కానీ విభజించకూడదు. తమ్ముడి మీద చూపే అనురాగం, తనపై చూపడం లేదని, దాన్ని తమ్ముడు దోచుకున్నాడని వాడి అభియోగం. తన బాధని, ఈ వయసులోనే ఇంతగా వ్యక్తీకరించాడంటే, భవిష్యత్తులో వాడు మరేం అగడాలకి, అఘాయిత్యాలకి పూనుకుంటాడో? దయచేసి, వాడి హృదయాన్ని అర్థం చేసుకోండి. మరోసారి ఇలా జరిగే ప్రమాదాన్ని రానివ్వకండి. ఇప్పు డంటే దొరికాడు, ఈసారి ఇంత తేలికగా దొరకకపోవచ్చు. అసలు దొరకని పరిస్థితి కూడా రావచ్చేమో." ఆవేశంగా అంది రాగిణి, కుర్చీలోంచి లేస్తూ.

"క్షమించండి. మా రాగిణిది మరీ సున్నితమైన మనస్సు. ఊరికే ఆవేశపడిపోతుంది." చెప్పాడు రాజేష్.

"కాదు! నా కళ్లు తెరిపించారు" అన్న భావనను కళ్లతోనే చెబుతూ, వీడ్కోలు చెప్పింది కిట్టూ తల్లి. టాటా చెప్పాడు కిట్టూ, స్కూటర్ మీద బయల్దేరిన రాగిణి, రాజేష్‌లకి.



## బాలీవుడ్ బాణీ

### నానా? నో నో!

'క్రాంతివీర్' చిత్రం నానా పాటేకర్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చినా ఆ చిత్ర దర్శకుడు మేహల్ కుమార్, నానా పాటేకర్‌ల మధ్య మాత్రం చిచ్చుపెట్టింది. బయటికి వారు స్నేహితుల్లా ఉంటున్నా వారిద్దరూ మాత్రం ఇప్పటికీ శత్రువుల్లాగే వ్యవహరిస్తున్నారు. నానాపై కోపంతోనే మేహుల్ తన కొత్త చిత్రంలో నసీరుద్దీన్ షాను తీసుకున్నాడు. ఇంతకూ ఆ శత్రుత్వానికి కారణ మేమిటీ అంటే, 'క్రాంతివీర్' చిత్ర కథకు తనూ పనిచేశాడు కనుక తన పేరూ వేయాలన్నాట్ట నానా! అయ్యా అదీ సంగతి!

మసూద్ అన్సారీ